క్లుప్తంగా

క్రీడలపై దృష్టి సారించాలి



క్రికెట్ పోటీల విజేత స్పార్టన్ జట్టు

చిల్లకూరు: యువత సెలవుల్లో క్రీడలపై దృష్టి పెట్టాలని తిమ్మనగారిపాళెంలో సీనియర్ క్రికెటర్లు సూచించారు. మండలంలోని తిమ్మనగారిపాళెంలో మూడు రోజులుగా విజయదశమి సందర్భంగా సెలవులు రావడంతో యువతకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయగా పోటీల్లో సుమారు ఆరు జట్లు తలపడ్డాయి. చివరి రోజైన మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో స్పార్టన్ జట్టుతో రెబల్స్ జట్టు తలపడగా స్పార్టన్ జట్టు 66 పరుగులతో విజయం సాధించింది. దీంతో విజేత జట్టుకు రూ.5 వేల నగదు బహుమతిని సీనియర్ క్రికెటర్లు అందజేశారు. అలాగే బంగారం అందజేశారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన ఎం నరేంద్ర, ఎం సుందరం, ఆరీఫ్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, సుందరం, రవికుమార్, నరేష్, కృష్ణ, స్వరాజ్, బద్రి, ప్రసన్న, లవ్లీ తదితరులు పాల్గొన్నారు.

సేవలు విస్తృతం



వస్త్రాలు పంపిణీ చేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సుస్మితారెడ్డి

చిల్లకూరు: పేర్నాటి చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలను విస్తృతం చేస్తున్నామని ట్రస్టు నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ హేమా సుస్మితారెడ్డి తెలిపారు. విజయదశమి సందర్భంగా మండలంలోని కలవకొండలో మంగళవారం 200 మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌తో పాటుగా పలు ప్రాంతాల్లో పేర్నాటి చారిటబుల్ టస్టు ద్వారా ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. అనంతరం గ్రామంలోని కొందరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరాగా ఆయన తన ప్రతినిధులను అక్కడ పరిశీలించి, ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కలువాయి: మండలంలోని వెంకటరామరాజుపేటలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తులకు మినరల్ వాటర్ అందించేందుకు మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో ఈ ప్లాంట్‌ను నిర్మించింది. నిర్మాణం పనులు పూర్తి కావడంతో ప్లాంట్‌ను ప్రారంభించారు. దీంతో గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కే వెంకటసుబ్బమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు కే కృష్ణయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం



వెంకటగిరి రూరల్: సాయిబాబా గ్రామోత్సవం

వెంకటగిరిరూరల్: దసరా పండుగ సందర్భంగా వెంకటగిరిలో షిరిడీ సాయిబాబా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయదశమిని పురస్కరించుకుని బాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాబాను ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు.

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు రాపూరులో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రాపూరు: హిందూ ధర్మప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు రాపూరులోని జూనియర్ కళాశాల ఆవరణలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్ల రథయాత్ర జరుగుతుందన్నారు. రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. అలాగే పురాణ ప్రవచనాలు, అన్నమాచార్య కీర్తనల ఆలాపన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చెడుపై విజయానికి ప్రతీక దసరా




గూడూరురూరల్: ద్రౌపదీదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు , సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మకు సారె తీసుకువెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

గూడూరురూరల్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగ అని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గూడూరులోని శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి దేవస్థానంలో ద్రౌపదీదేవి అమ్మవారిని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చెన్నూరులో రామలింగ చౌడేశ్వరీదేవి గ్రామోత్సవంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొని, అమ్మవారికి మొక్కు చెల్లించారు. గూడూరులోని రాజరాజేశ్వరి దేవస్థానంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి ఎన్ నాగులు, బీసీ నాయకుడు బీ గోపీ యాదవ్, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా చెంగాళమ్మ

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ ఆలయంలో శరన్నవరాత్రులు మంగళవారంతో ముగిశాయి. విజయదశమి సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అంకారానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉదయం ఆలయంలో చండీయాగం చేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య రాష్ట్ర ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. ఆలయ చైర్మన్ డీ బాలచందారెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి, సారె అందుకున్నారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

పార్వతీదేవికి బంగారు చీరతో అలంకరణ

పట్టణంలోని గంగాపార్వతి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా ఆలయ చైర్మన్ సీ సుబ్రమణ్యంరెడ్డి దంపతులు అమ్మవారికి బంగారు చీర సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వర్ణ చీర, ఆ భరణాలను అలంకరించారు. భక్తుల సహకారంతో రూ.10లక్షలు వెచ్చించి స్వర్ణాభరణాలు చేయించినట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శమీ పూజలు చేశారు.

వైభవంగా పోలేరమ్మ నగరోత్సవం

నాయుడుపేటటౌన్: దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం రాత్రి గ్రామదేవత పోలేరమ్మ నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. చివరిరోజు పోలేరమ్మకు రాజరాజేశ్వరి అలంకారం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి నగరోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ గంధవళ్లి సిద్దయ్య పాల్గొన్నారు. ముగాంబికాదేవికి రాజరాజేశ్వరి అలంకారం చేశారు. శ్రీవల్లి దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి విజయలక్ష్మి పూజ ఘనంగా నిర్వహించారు. చండీయాగ పూజల్లో పాల్గొన్న 108 మంది మహిళలకు దాతల సహకారంతో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ చీరలు పంపిణీ చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పసుపు, కుంకుమ, గాజులను భక్తులకు పంపిణీ చేశారు. దుర్గమల్లేశ్వరి ఆలయంలో అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం చేశారు. నగరోత్సవం జరిపారు.

ఊరూరా దసరా సంబరాలు

పెళ్లకూరు: విజయదశమి సందర్భంగా మంగళవారం ఊరూరా సంబరాలు జరుపుకున్నారు. తమ వాహనాలకు మామిడి తోరణాలు, అరటి పిలకలు, పుష్పాలతో అలంకరించి ఆయుధపూజ చేశారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, దూప దీప నైవేద్యాలు సమర్పించారు.

పెంచలకోనలో ముగిసిన ఉత్సవాలు

రాపూరు: పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలు విజయదశమితో ముగిశాయి. మంగళవారం ఉదయం స్వామివారి అలంకార మండపంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సమూర్తిని అశ్వవాహనంపై కొలువు దీర్చి అలంకరించారు. అనంతరం పార్వేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం గోనుపల్లిలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి అశ్వవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే రాపూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి మూలమూర్తికి రుద్రాక్షల అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవమూర్తిని అందులో కొలువుదీర్చి విజయలక్ష్మీదేవి అలంకరణ చేశారు. సాయంత్రం జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వేపినాపి సమీపంలోని అంకమ్మ, రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు.

బాలాత్రిపురసుందరిదేవిగా అమ్మవారు

సైదాపురం: మండల కేంద్రంలోని బాలాత్రిపుర సుందరిదేవి చివరిరోజున బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా హోమం చేశారు. వందలాది మంది భక్తులు ఆలయానికి తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. మంగళవారం ఉదయం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. చాగణంలో మంగళవారం అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

సామూహిక పొంగళ్లు

చిట్టమూరు: మండలంలోని ఆరూరు గ్రామదేవత ఎల్లమ్మకు గ్రామస్తులు మంగళవారం సామూహిక పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. విజయదశమి సందర్భంగా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. అనంతరం పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు.

కలవకొండలో శమీ పూజలు

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో ఉన్న జమ్మి చెట్టుకు మంగళవారం శమీ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ విజయదశమిరోజు జమ్మి చెట్టుకు పూజలు చేస్తే శుభాలు కలుగుతాయన్న నమ్మకం ఉందన్నారు.

ఘనంగా దసరా

వెంకటగిరిరూరల్: పట్టణంలో దసరా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని పలువురు తమ వాహనాలకు ఆయుధపూజ చేశారు.



సూళ్లూరుపేట రూరల్: మహిషాసురమర్దినిగా చెంగాళమ్మ



సూళ్లూరుపేట రూరల్: బంగారు చీరలో పార్వతి



నాయుడుపేట టౌన్ : పోలేరమ్మ నగరోత్సవం



సైదాపురం: ఊరేగుతున్న బాలాత్రిపురసుందరి








నాయుడుపేటటౌన్: రాజరాజేశ్వరిదేవిగా పోలేరమ్మ, విజయలక్ష్మిగా కన్యకపరమేశ్వరి, రాపూరు: కన్యకాపరమేశ్వరికి రుద్రాక్షల అలంకరణ, రాజరాజేశ్వరిదేవిగా అంకమ్మ, అశ్వవాహనంపై లక్ష్మీనరసింహస్వామి, సైదాపురం: హోమంలో పాల్గొన్న భక్తులు

అంబేడ్కర్‌భవన్ ఆధునికీకరణ



అంబేడ్కర్‌భవన్‌లో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: పట్టణంలో నిరుపయోగంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌భవన్ రూ.25 లక్షల వ్యయంతో ఆధునికీకరణ పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, కమిషనర్ శ్రీనివాసరావు తదితర నాయకులతో కలసి అంబేడ్కర్‌భవన్‌లో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంత కాలంగా అంబేడ్కర్‌భవన్‌లో కొన్ని సమస్యలు నెలకొనడంతో నిరుపయోగంగా మారిందన్నారు. ఇటీవల అంబేడ్కర్‌భవన్‌కు చుట్టుపక్కల అక్రమణలు జరగడంతో సుమారు రూ.20 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించామన్నారు. అలాగే మున్సిపాలిటీ సాధారణ నిధులతో అంబేడ్కర్‌భవన్ ఆవరణలో చదును చేశామన్నారు. అంబేడ్కర్‌భవన్‌కు పెయింటింగ్, సీలింగ్, విద్యుత్, నీటి వసతులతోపాటు ఏసీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం సోమశేఖర్ రెడ్డి, నాయకులు కలికి మాధవరెడ్డి, కే జయరామయ్య, బీ మల్లికార్జునరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, పీ హరినాథ్‌రెడ్డి, డీ రవి, ఎస్సీఆర్, పీ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ సేవలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



అంకమ్మ ఆలయంలో మేకపాటి విక్రమ్‌రెడ్డి

రాపూరు: మండలంలోని వేపినాపి వద్ద ఉన్న అంకమ్మను మంగళవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, కుటుంబసభ్యులతో కలసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దేవస్థానం నిర్వాహకులు పీ వేణుగోపాల్‌రెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, లీలామోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు మహారాజగోపుర కలశ ప్రతిష్ట

నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున నిర్మించిన అభయానుగ్రహ వేంకటేశ్వరస్వామి ఆలయ మహారాజ గోపుర కలశ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక వేడుకలను బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పీ నరసింగరావు తెలిపారు. తెలంగాణ సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆయన సతీమణి శోభమ్మ సహకారంతో నిర్మించిన మహాగోపుర ప్రతిష్ఠ టీటీడీ దేవస్థానం పూర్వాచార్యులు ఉదయగిరి అనంత నారాయణ చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ సీఎం సమీప కుటుంబ సభ్యులు, బంధువులు, తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

నాయుడుపేటటౌన్: మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం చెంబడిపాళెం గ్రామానికి చెందిన చిమిర్తిపల్లి నాగరాజు, మనుబోలు పెంచలయ్య అనే వ్యక్తులు ద్విచక్రవాహనంలో గూడూరు నుంచి నాయుడుపేట వైపు బయలుదేరారు. మార్గమధ్యంలో మండలంలోని తుమ్మూరు సమీపంలో స్వర్ణముఖి నది బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వారి వాహనాన్ని ఢీకొంది. గాయపడిన ఇద్దరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే పుదూరు సమీపంలో రహదారిపై మంగళవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఓ వాహనంలోని చిట్టమూరు మండలం కోతలగుంటకు చెందిన సురేష్‌కు గాయాలయ్యాయి. మరో బైక్‌లో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ ప్రమాదాలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహారావు తెలిపారు.

నేడు కల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

దొరవారిసత్రం: కల్లూరు సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురామయ్య తెలిపారు. ఈశిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు సైతం పరీక్షల చేయించుకుని, మందులు తీసుకోవచ్చన్నారు.

సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రి

నాయుడుపేటటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, టీడీపీ మోసపురితా విధానాలను నమ్మే పరిస్థితి లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేనకూరులో మంగళవారం ఆయన జెడ్పీటీసీ సభ్యురాలు కట్టా జ్యోతిరెడ్డితో కలసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు అనవసరంగా రాద్ధాంతం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఇర్ కన్స్ట్రక్షన్స్ మేనేజర్ షేక్ రఫీ, అత్తికాయల నరేంద్ర పాల్గొన్నారు.

క్వారీ వివాదంపై ఫిర్యాదు

పెళ్లకూరు: మండలంలోని కానూరు రెవెన్యూ పరిధిలో ఉన్న మైనింగ్ క్వారీలో చోటు చేసుకున్న వివాదంపై మంగళవారం మెగా కంపెనీ తరపున మల్లికార్జున్, సన్నిహిత ఎంటర్ ప్రైజెస్ నుంచి ప్రవీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లీజు అగ్రిమెంట్ ప్రకారం మైనింగ్ క్వారీలో నిల్వ ఉన్న 1.50 లక్షల మెట్రిక్ టన్నులు కంకర తీసుకెళ్లనివ్వకుండా సన్నిహిత ఎంటర్ ప్రైజెస్ యాజమాన్యం అడ్డుకుంటున్నారని కంపెనీ ప్రతినిధి మల్లికార్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఫోర్జరీ సంతకంతో మైనింగ్ క్వారీలో అక్రమంగా తవ్వకాలు చేపట్టి, రాయల్టీ చెల్లించకుండా దౌర్జన్యంగా కంకరను తీసుకెళుతున్నారంటూ సన్నిహిత ఎంటర్ ప్రైజెస్ ఎండీ సర్వేపల్లి ప్రవీణ ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులను పోలీసులు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

కండలేరులో 11.480 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.480 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నెరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలో తాళ్వాయిపాడు వద్ద మంగళవారం ముందు వెళుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి తిరుపతికి ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో తాళ్వాయిపాడు వద్ద ముందు వెళుతున్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో బస్సు అద్దం పగిలిపోవడంతో ముందు సీటులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

రక్తదానం..ప్రాణదానంతో సమానం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి

గూడూరురూరల్: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గూడూరులోని వీఎస్ఆర్ పాఠశాలలో ప్రభాస్ యువసేన అధ్యక్షుడు యోగి ఆధ్వర్యంలో జరిగిన సినీ హీరో యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గూడూరు, పరిసర ప్రాంతాల నుంచి యువకులు అధిక సంఖ్యలో పాల్గొని 150 యూనిట్ల రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అలాగే నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం చేశారు. అనంతరం కోనేటిమిట్ట ప్రాంతానికి చెందిన అన్వేష్ దివ్యాంగుల అంతర్జాతీయ క్రికెట్‌కు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందుకున్న సందర్భంగా అన్వేష్‌ను అభినందించారు. అలాగే మాళవ్యానగర్‌లో ఉన్న సీనియర్ నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కోశాధికారి సూరిశెట్టి హరికృష్ణ, తిరుపతి జిల్లా డీవీఎంసీ సభ్యుడు వీ ప్రభాకర్, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలి



నేతలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: రానున్న ఎన్నికల దృష్ట్యా వైఎస్సార్ సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెడుతున్న పార్టీ కార్యక్రమాలు ప్రతి ఒకటి విజయవంతంగా పూర్తి చేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఇటీవల తన పెద్దనాన్న డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డి మృతి చెందడంతో మరోసారి ఆయన కుమారుడు, పార్టీ మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డిని పరామర్శించి, పార్టీ నేతలతో పలు విషయాలపై చర్చించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని మండల నేతలు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రజలు ఆశీర్వదించేలా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. చెప్పిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు ఆర్ రామకృష్ణ, నాయకులు కే దామోదర్‌రెడ్డి, డీ అజిత్‌కుమార్‌రెడ్డి, పీ కోటేశ్వరరెడ్డి, ఎస్ మధురెడ్డి, తదితరులు ఉన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో కొంతమంది ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు మంగళవారం ఆక్రమణలు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయానికి ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 191, 192, 195, 197లో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకుని క్రయ విక్రయాలు చేయడమే కాకుండా పక్కా భవనాలు నిర్మించేందుకు సిద్ధం అవుతుండడంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక వీఆర్వోతో పాటుగా ఆర్ఐ రమ్యస్వాతి క్షేత్రస్థాయిలో పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. దీంతో వీఆర్వో జగదీష్ విచారణ ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలో ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.